YOUNG INTELLECTUAL
ESTABLISHED AUGUST - 2024
BILINGUAL (TELUGU AND ENGLISH)- QUARTERLY - MULTIDISCIPLINARY -
OPEN ACCESS - E - JOURNAL FOR DEGREE COLLEGE STUDENTS AND FACULTY
Published by : D. Yeswanth Reddy, c/o. Tirupathi Reddy, 16-183/1, Ramakrishna Colony,
Mylavaram, NTR District, Andhra Pradesh. Pin : 521230, mail ID : yeswanth.devarapalli@gmail.com
15

# మహాప్రస్థానం

**కొల్లి తులసి,**
బి.ఎ. (ఓరియంటల్ లాంగ్వేజ్) తెలుగు,
5వ సంవత్సరం
మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి,
జిల్లెళ్ళమూడి – 522 113.
బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్
చరవాణి : 9949621446

**కవి పరిచయం :**

శ్రీశ్రీగా పేరు పొందిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించారు. 1931లో బి.ఏ. చదివి, అనేక పదవులు నిర్వహించి, సినీకవిగా, అభ్యుదయ కవిగా, విప్లవ కవిగా ఆధునిక సాహితీ లోకంలో కొత్త ఒరవడిని సృష్టించారు. భావకవిత్వంలో "ప్రభవ", అభ్యుదయ కవిత్వంలో "మహాప్రస్థానం", విప్లవ కవిత్వంలో "మరో ప్రస్థానం", "ఖడ్గ సృష్టి" మొదలైన తెలుగు కావ్యాలను రచించారు. ఖడ్గసృష్టి కావ్యానికి 1966లో సోవియట్ భూమి అవార్డు, 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1979లో రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డులను అందుకున్నారు. అరసం, విరసం సంస్థలకు అధ్యక్షుడిగా ఉన్న శ్రీశ్రీ 1983 జూన్ 15న మహాప్రస్థానం చెందారు.

**నేపథ్యం:**

సామాజిక వాస్తవికతకు, మార్క్సిజానికి కవిత్వంలో స్థానమిచ్చి, సామాన్యుడిని మాన్యుడిగా చిత్రీకరించి, గ్రాంథికభాషకు గణబద్ధ ఛందస్సులకు స్వస్తి పలికి, ఆధునిక తెలుగు కవిత్వాన్ని దారి మళ్ళించి వాడుకభాషకు ప్రాధాన్యమిచ్చి, నాటి జాతీయ అంతర్జాతీయ పరిణామాలను ఆధారంగా చేసుకొని మహాప్రస్థానం రచించడం జరిగింది.

**నామాట :**

శ్రీశ్రీ మహాప్రస్థానానికి "నామాట" అనే పేరుతో రచనా విధానాన్ని తన చేతిరాత ప్రతిలో వివరంగా తెలియజేశాడు. తన కంఠధ్వనితో మహాప్రస్థాన గీతాలను గానం చేసి, సొంత దస్తూరిలో రాసి 1940 నాటికి మహాప్రస్థానం ప్రెస్ కాపీ సిద్ధం చేసి, జనార్దనరావుకు అంకితమిచ్చాడు. స్పెయిన్ అంతర్యుద్ధం, ఆడెన్, స్పెండల్ మహాకవుల రచనలు, ఇంగ్లాండ్ నుంచి వెలువడిన ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్ మానిఫెస్టోలు మహాప్రస్థాన రచనకు శ్రీకారం చుట్టాయని తెలిపారు. మహాప్రస్థానంలో అభ్యుదయ కవిత్వముతో బాటు విప్లవకవిత్వ బీజాలున్నాయి అని శ్రీశ్రీ నొక్కి వక్కాణించాడు.

**యోగ్యతాపత్రం :**

శ్రీశ్రీ మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం పేరుతో చెలం ముందుమాటను వ్రాశాడు. ముందుమాట వ్రాయమని శ్రీశ్రీ అడిగితే **శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లేవన్నాడు.** తూచవద్దు అనుభవించి పలవరించమన్నాడు శ్రీశ్రీ. నెత్తురూ కన్నీళ్ళూ తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ యీ వృద్ధ ప్రపంచానికి. శ్రీశ్రీ మహాప్రస్థానంలో అందరి బాధను పలికించాడు.

**క్రిష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ.** తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వ శక్తి మహాప్రస్థానంలో ఉందన్నాడు.

**మహాప్రస్థానం – నిర్వచనం :**

**"సామ్యవాద స్వర్గాన్ని సాధించడం కోసం కార్మిక కర్షక రంగాలవారు కలిసి చేసే సుదీర్ఘ పోరాట ప్రయాణం "మహాప్రస్థానం". మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం అని అర్థం.**

**మహాప్రస్థాన ఖండికలు :**

మహాప్రస్థానంలో 40 ఖండికలున్నాయి. అందులో మొట్టమొదటిది మహాప్రస్థానం. వీటిలో "జయభేరి"లోని "నేను సైతం..." అనే కవితా పంక్తులు "రుద్రవీణ" సినిమాలోనూ, ఠాగూర్ సినిమాలోనూ నేపథ్యంగా వినిపిస్తాయి. ఋక్కులు ఖండిక ఏ వస్తువును హీనంగా చూడకూడదనే అద్భుత సందేశం ఇస్తుంది. "ప్రతిజ్ఞ" ఖండిక కార్మిక కర్షక రంగాలవారి, కులవృత్తులవారి శ్రమజీవన సౌందర్యాన్ని తెలియజేస్తుంది. నవకవితలో కవితా ప్రయోజనాన్ని విశదీకరించాడు. దేశచరిత్రలులో దేశాల స్థితిగతుల్ని వర్ణించాడు. గేయఖండికల శీర్షికలలో ఎన్నో వైవిధ్యభరితాలున్నాయి.

**గర్జించు రష్యా :**

"గర్జించు రష్యా" గేయంలో 'గర్జించు రష్యా! గాండ్రించు రష్యా! పర్జన్య శంఖం పలికించు రష్యా!' అని వ్రాశాడు శ్రీశ్రీ. నేడు రష్యా ఉక్రెయిన్ దేశం మీద గర్జిస్తూ గాండ్రిస్తూ పర్జన్య శంఖం పూరిస్తున్నది.

**మహాప్రస్థానం – వాడుకభాషాపదాలు :**

మహాప్రస్థానంలో ఎన్నో వాడుకభాషా పదాలున్నాయి. "పదండి ముందుకు – పదండి త్రోసుకు – పోదాం పోదాం..", "కుక్కపిల్ల – అగ్గిపుల్ల – సబ్బుబిళ్ళా...", "రొట్టెముక్క – అరటితొక్కా...", "కూటికోసం – కూలికోసం...", "పోనీ పోనీ – పోతే పోని... రానీ రానీ – వస్తే రానీ", "ఏవో – ఏవేవో", "ఔను నిజం – నీవన్నది..."

**మహాప్రస్థానం – ప్రభావం :**

ఆధునిక తెలుగు కవిత్వంలో అభ్యుదయ నేపథ్యంగా వెలువడిన మహాప్రస్థానం తదనంతర కవుల మీద ఎంతో ప్రభావం చూపింది. **"అనితరసాధ్యం – నా మార్గం"** అని శ్రీశ్రీ చెప్పినా, శ్రీశ్రీ లాగే కవిత్వం వ్రాయాలని ఎంతో మంది ప్రయత్నించారు. మహాప్రస్థానంలోని భావావేశం, ప్రాసక్రీడ, వాస్తవిక జీవనచిత్రణ దేశాల స్థితిగతులు అందరి మనస్సులను ఆకర్షింపజేశాయి.

YOUNG INTELLECTUAL
BILINGUAL (TELUGU AND ENGLISH) QUARTERLY - MULTIDISCIPLINARY -
OPEN ACCESS - E - JOURNAL FOR DEGREE COLLEGE STUDENTS AND FACULTY
Published by : D. Yeswanth Reddy, c/o. Tirupathi Reddy, 16-183/1, Ramakrishna Colony,
Mylavaram, NTR District, Andhra Pradesh. Pin : 521230, mail ID : yeswanth.devarapalli@gmail.com

**మహాప్రస్థాన సందేశం :**

మానవుడిలో, వస్తువులలో, దేశాలలోని ప్రతిభను, గొప్పదనాన్ని గుర్తించాలి. విలువ ఇవ్వాలి, కవితీకరించాలి. సామాన్యుడిలో దాగివున్న మాన్యుడిని దర్శించాలి. ప్రతి ఒక్కరూ కవితా స్పృహ కలిగి ఉండాలన్నాడు.

**అంకితం :**

శ్రీశ్రీ తన అభ్యుదయ కావ్యమైన మహాప్రస్థానాన్ని ఆప్తమిత్రుడు కొంపెల్ల జనార్ధనరావుకు అంకితమిచ్చాడు. కొంపెల్ల జనార్ధనరావు కవి, విమర్శకుడు, ఉదయిని పత్రికా నిర్వాహకుడు. క్షయవ్యాధి వల్ల ఆకస్మిక మరణం చెందిన జనార్ధనరావును గురించి స్మృతి కవిత్వం వ్రాస్తూ **“అంకితం (కొంపెల్ల జనార్దనరావు కోసం)”** అనే శీర్షికతో ఒక ఖండిక వ్రాశాడు.

**విమర్శ :**

అభ్యుదయ రచయితల మహాసభ సంచికలో ఆర్. నరసింహారెడ్డి గారు అభ్యుదయ సారస్వతం ఎలా ఉండాలి! అనే వ్యాసం వ్రాశారు. శ్రీకృష్ణగారు వ్రాసిన “సారస్వత సమాలోచన” అనే వ్యాసం కూడా అభ్యుదయ సాహిత్య విమర్శా ధోరణి కనిపిస్తుంది. అభ్యుదయ ఉద్యమం ఆరంభమైనపుడే సాహిత్య విమర్శకు సైద్ధాంతిక బలాన్ని చేకూర్చిన ఘనత శ్రీశ్రీకి కొడవటిగంటి కుటుంబరావుకు దక్కుతుంది. శ్రీశ్రీగారు **సాహిత్యం ఎందుకు?” అంటే సమాజాభివృద్ధికి** అని చెప్పారు. **ఏది విప్లవపంథా? అంటే సమాజాన్ని ముందుకు నడిపించడమే విప్లవపంథా** అని శ్రీశ్రీగారు పేర్కొన్నారు. 1946 ‘తెలుగుతల్లి’ పత్రికలో ‘అభ్యుదయ సాహిత్యం’ అనే వ్యాసం వ్రాశారు.

అభ్యుదయ సాహిత్య విమర్శకులు గురజాడను, శ్రీశ్రీని, దిగంబర కవులను, వారి కావ్య వస్తువులను సమాజ పరిణామాలతో ఉన్న సంబంధాన్ని ప్రాతిపదికగా విమర్శకు పదును పెట్టారు. శ్రీశ్రీ సాహిత్యంలో విమర్శలో మార్క్సిస్టు అవగాహన, కమ్యూనిస్టు దృక్పథం ఉందన్నారు. అభ్యుదయ సాహిత్యం వాస్తవికతా దృక్పథంలో ఉంటుంది. ఉత్పత్తి, ఉత్పత్తి శక్తులు, కర్షకులు, కార్మికులు ఈ సాహిత్యంలో ఉండడమే మార్క్సిస్టు లక్ష్యంగా పరిగణించారు.

ఆధునికాంధ్ర సాహిత్యంలో అభ్యుదయ కవితాయుగం స్వర్ణయుగం. ఈ స్వర్ణయుగం కలికితురాయిగా మహాప్రస్థానాన్ని అభివర్ణించడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**

1. మహాప్రస్థానం – శ్రీశ్రీ

2. తెలుగు సాహిత్య విమర్శా సిద్ధాంతాలు – వెలమల సిమ్మన్న